క్లుప్తంగా

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



కిరణ్‌కు అప్పగిస్తున్న సీఐ కరుణాకర్

వేములవాడ: సిరిసిల్లకు చెందిన గోవిదు కిరణ్ తన ఫోన్‌పోగొట్టుకున్నాడు. ఈక్రమంలో వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా పోలీసులు ప్రత్యేక యాప్ ద్వారా మొబైల్‌ను కనుగొని శనివారం కిరణ్‌కు సీఐ కరుణాకర్ అప్పగించారు. పోలీసులకు కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు. ఎవరైనా మొబైల్ పోగొట్టుకుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సీఐ కోరారు.

మంత్రి వ్యాఖ్యలపై ఫైర్..

సిరిసిల్లటౌన్: చిత్రకారులను హేళన చేసేలా మంత్రి ఎరవెల్లి దయాకర్‌రావు వ్యాఖ్యలున్నాయని తెలంగాణ పెయింటింగ్ చిత్రకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వెంగళ గణేశ్, మల్లేశం తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి గోడలపై రంగులు వేసేవాడంటూ వ్యంగ్యంగా మాట్లాడ్డం సరికాదన్నారు. చిత్రకారులు రంగులు వేస్తేనే తమలాంటి నాయకులకు రాజకీయ ప్రచారం జరుగుతుందన్నారు. పెయింటర్లకు మంత్రిగా మీరు చేసింది శూన్యమని, పైగా తమను అవమానించేలా వ్యాఖ్యానించిన మాటలు వెనక్కు తీసుకోవాలని కోరారు. మరోమారు ఇలాంటి వ్యాఖ్యలు చేయకూడదంటూ హితువు పలికారు.

కమిషనర్‌కు ప్రమోషన్



వేములవాడ: మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అన్వేశ్‌కు రాష్ట్రప్రభుత్వం గ్రేడ్–2 కమిషనర్‌గా పదోన్నతి కల్పించింది. శనివారం మున్సిపల్‌చైర్‌పర్సన్ మాధవి, కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత

బోయినపల్లి: వ్యవసాయ మార్కెట్‌కమిటీ పరిధిలోని గ్రామాల రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి తెలిపారు. పాలకవర్గం ఏర్పడి ఏడాదైన సందర్భంగా శనివారం మాట్లాడుతూ.. యాసంగి సీజన్‌లో పెద్దఎత్తున ధాన్యం కొనుగోలు చేశామన్నారు. మార్కెట్ సేవలు విస్తరించేందుకు ప్రణాళికచేస్తున్నామన్నారు. మార్కెట్ సేవలు వినియోగించుకోవా లని కోరారు.

రోడ్డు చదును



చదును చేయిస్తున్న ఏఈ నర్సింహాస్వామి

వేములవాడ: వేములవాడలోని సెస్ ఆఫీస్ ముందున్న గుంతతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్న వైనాన్ని సాక్షి ఇటీవల ప్రచురించింది. సాక్షి కథనానికి స్పందించిన మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ శనివారం రోడ్డు చదునుచేయాలని ఏఈ నర్సింహస్వామిని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది ట్రాక్టర్‌తో రోడ్డుపై మట్టి, మొరం పోసి చదు నుచేశారు. వాహనదారుల ఇక్కట్లు తొలగిపోయాయి.

హుజూరాబాద్ ఆర్డీవోగా రాజు



వేములవాడఅర్బన్: వేములవాడ తహసీల్దార్ ఎస్. రాజు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే. శనివారం హుజూరాబాద్ ఆర్డీవోగా పోస్టింగ్ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కూల్ కేక్‌లో బొద్దింక కాలు..

రుద్రంగి: మండలకేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఓబేకరిలో కొనుగోలు చేసిన కూల్ కేకులో బొద్దింక కాలువచ్చింది. కేకు కొనుగోలు చేసి సగంతిన్న తర్వాత కూల్ కేక్‌లో బొద్దింక కాలు కనిపించడంతో కొనుగోలు దారులు వాంతులు చేసుకున్నారు. నిర్వాహకులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా ఫుడ్‌సేఫ్టీ అధికారులు మామూళ్ల మత్తులో తూగుతూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

సినారెకు ఘన నివాళి

వేములవాడఅర్బన్/వేములవాడరూరల్: వేములవాడ పట్టణంలోని నృత్య కళానికేతన్ సేవాసంస్థ, జిల్లా సాంస్కృతిక కళా సంస్థల సమాఖ్య కార్యాలయంలో సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు యెల్ల పోశెట్టి ఆధ్వర్యంలో డా. సి. నారాయణరెడ్డి జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రాపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

బీజేపీ నాయకుల సంబరాలు

బోయినపల్లి: కరీంనగర్ ఎంపీ బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌కి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి రావడంపై శనివారం మండలకేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు జరిపి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్ రెడ్డి, నాయకులు ఉన్నారు

మూలవాగుపై వంతెన నిర్మించాలి

గత మూడురోజులుగా కురిసిన భారీవర్షాలకు సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో చెరువులు, వాగులు, కుంటలు పొంగిపొర్లాయి. దీంతోపాటు ప్రధాన రోడ్లు, రహదారులు తెగిపోయాయి. ఫలితంగా రాకపోకలకు అంతరాయం కలిగింది. పంటపొలాల్లో ఇసుకమేటలు వేశాయి. ఈ సందర్భంగా శనివారం పలు పార్టీల నాయకులు, శ్రేణులు నియోజకవర్గంలో తలెత్తిన సమస్యలను పరిశీలించారు. మరికొన్ని చోట్ల రహదారులపై మట్టిపోసి రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. పలువురు సమస్యలపై వేలెత్తిచూపారు.



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

గంభీరావుపేట: మండలంలోని మల్లుపల్లి మూల వాగు ఉధృతికి ప్రతిసారి రోడ్డు కొట్టుకుపోయి రైతు లు నష్టపోతున్నారని,దీనిపై హైలెవల్ వంతెన నిర్మించాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశా రు. వర్షానికి తెగిన రోడ్డుపై బీజేపీ నాయకులునిరసన తెలిపారు. రోడ్డు తెగిపోయి ప్రతి ఏటా రాకపోకలు నిలుస్తుంటే వంతెన నిర్మాణంపై కేటీఆర్‌కు చిత్తశుద్ధిలేదన్నారు. మండల అధ్యక్షుడు గంట అశోక్, నాయకులు దేవ య్య, రాజు యాద వ్, మహేశ్, రమేశ్, మురళిగౌడ్, విగ్నేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సూచిక బోర్డు ఏర్పాటు

వీర్నపల్లి: మండలకేంద్రంలోని ఎస్సార్ పెట్రోల్ బంక్ వద్ద మూడు రోజులుగా కురిసిన భారీ వర్షానికి రోడ్డు పక్కనున్న మట్టి కోతకు గురైంది. దీంతో రాకపోకలకు ఇబ్బంది తలెత్తడంతో కోతకు గురైన రోడ్డుపై వాహనదారులకు ఇబ్బందిలేకుండా ప్రమాదకర సూచికబోర్డు ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు. కోతకు గురైన రోడ్డులో మిషన్ భగీరథ పైపు పగిలిపోవడంతో స్పందించిన సర్పంచ్ పాటి దినాకర్ పైపులైన్ మరమ్మతులు చేయించి కాలనీవాసులకు తాగునీరందించారు. సర్పంచ్, ఉప సర్పంచ్ రవికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా రోడ్డు

రుద్రంగి: ఇటీవల కురిసన భారీ వర్షాలకు రుద్రంగిలోని ఇందిరాచౌక్ నుంచి పెట్రోల్‌బంకు వరకు కోరుట్ల, వేములవాడ ప్రధాన రహదారికి ఇరువైపులా మట్టి కోసుకుపోయి రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. అక్కడక్కడ మోకాలు లోతు కయ్యలు ఏర్పడ్డాయి. ఎలాంటి ప్రమాదం జరగకముందే మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఫలించిన శ్రమ



కల్వర్టుకు మరమ్మతులు చేయిస్తున్న సలీమ్

వేములవాడరూరల్: వర్షాలధాటికి తెగిన కల్వర్టులతో నాలుగు రోజులుగా రాకపోకలు రెండో సారి నిలిచిపోయాయి. జగిత్యాల నుంచి శాత్రాజుపల్లి మీదుగా వేములవాడకు వచ్చే కల్వర్టు వద్ద వర్షాలకు తెగిపోయాయి. దీంతో శాత్రాజుపల్లి 2వ వార్డు కౌన్సిలర్ రెండుమిద్దెల జయ సలీమ్ ప్రత్యేక చొరవతో ఆరు గంటలు శ్రమించి ఎట్టకేలకు భారీవాహనాల రాకపోకలు ప్రారంభించారు. దీంతో వార్డు ప్రజలతోపాటు పలువురు వారిని అభినందించారు.

బ్రిడ్జి వద్ద కుంగిన రోడ్డు పరిశీలన



రైతు నాగరాజుతో మాట్లాడుతున్న ఆగయ్య

వీర్నపల్లి: మండలకేంద్రంలోని పెద్దవాగుపై నిర్మించిన నూతన బ్రిడ్జిని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య శనివారం పరిశీలించి మాట్లాడారు. మూడురోజులుగా కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగుపై నిర్మించిన నూతన బ్రిడ్జి పక్కనున్న మట్టి కోతకు గురైందని బ్రిడ్జి దగ్గర పోసిన మట్టి కుంగడంతో రాకపోకలకు అంతరాయం కలిగిందని రాకపోకలకు అంతరాయం లేకుండా చేస్తామన్నారు. అనంతరం రైతు నేరళ్ల నాగరాజు ఆగయ్యతో మాట్లాడుతూ ఇదంతా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో జరిగిందని వాపోయాడు. సెస్‌డైరెక్టర్ మల్లేశం, సర్పంచ్ దినకర్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ఉప సర్పంచ్ బోయిని రవి, నాగరాజు, దేవరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కారం



పనులు చేయిస్తున్న సెస్‌వైస్ చైర్మన్ తిరుపతి

కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తామని సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి అన్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు బావుసాయిపేట, మామిడిపల్లి గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్, 20 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో రూ. 10లక్షల వ్యయంతో పునరుద్ధరణ పనులు వేగంగా చేయిస్తున్నారు. వైస్‌చైర్మన్ మాట్లాడుతూ.. వర్షాలకు మండలంలోని మామిడిపల్లి, బావుసాయిపేట గ్రామాల్లో తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లిందన్నారు. ఆయా గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు విద్యుత్ పనులను త్వరగా చేపట్టాలని ఆదేశించగా పనులు ప్రారంభించామన్నారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసే పనులు పూర్తయ్యాయని దీంతో రైతుల పొలాలకు నీరు పూర్తిస్థాయిలో అందుతుందన్నారు. గ్రామాల్లో ఎలాంటి విద్యుత్ సమస్యలున్నా తమను సంప్రదిస్తే సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో లైన్‌ఇన్‌స్పెక్టర్లు వైకుంఠం, రాజయ్య, లైన్‌మెన్ రాజశేఖర్, హెల్పర్లు చందు, సురేశ్, నాయకులు మల్లయ్యగౌడ్, లక్ష్మారెడ్డి, రమేశ్ ఉన్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో తిప్పలు

కోనరావుపేట: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఇటీవల నిర్మించిన వంతెనకు ఇరువైపులా పోసిన మట్టి మొత్తం వర్షాలకు కొట్టుకుపోయింది. మండలకేంద్రంలో ఇటీవలే రూ. 30లక్షల వ్యయంతో ఒర్రెపై వంతెన నిర్మించారు. పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతప్రమాణాలు పాటించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వంతెనకు ఇరువైపులా మట్టిని సరిగా పోయకపోవడం, పోసిన మట్టిని రోలింగ్ చేయకపోవడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో బస్టాండ్ నుంచి పోలీస్‌స్టేషన్, ఆరోగ్యకేంద్రం, మండలపరిషత్, తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

రైతులను ముంచిన చెక్‌డ్యాం నిర్మాణాలు

వేములవాడరూరల్: మండలంలోని మూలవాగులో నిర్మిస్తున్న చెక్‌డ్యాంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొల్లారం, లింగంపల్లి, జయవరం గ్రామాల్లో మూలవాగుపై చెక్‌డ్యాంలు నిర్మిస్తున్నారు. ఈ చెక్‌డ్యాంతో పాటు సైడ్ వాల్స్ నిర్మించక వర్షంనీరు పక్కనున్న పంట పొలాల్లో చేరుతున్నాయన్నారు. దీంతో పంటలు కొట్టుకుపోయాయని బొల్లారంకు చెందిన బుర్ర లక్ష్మిరాజం ,షేక్ ఖాజామియా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం అందించాలని వేడుకుంటున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల/గంభీరావుపేట: ఎన్నికల హామీలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డి విమర్శించారు. సిరిసిల్ల పట్టణ శివారులోని చిన్నబోనాల చెరువు తెగి సిరిసిల్ల పట్టణ ప్రజలు వరదల్లో మునిగినా.. కనీసం పలకరించే సమయం ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్‌కు లేకుండాపోయిందని కాంగ్రెస్ నేత కేకే.మహేందర్‌రెడ్డి మండిపడ్డారు. రోడ్లు దెబ్బతిన్నాయి.. పొలాలు కొట్టుకుపోయాయి.. ఇండ్లు కూలిపోయాయి, సిరిసిల్లలో వరదనీరు ముంచింది... ఇంత ప్రకృతి బీభత్సం జరిగినా.. హైదరాబాద్‌లో ఉండి.. సిరిసిల్ల వైపు కన్నెత్తి చూడకపోవడంపై శోచనీయమన్నారు. గంభీరావుపేటలో మాట్లాడుతూ.. మంత్రి కేటీఆర్ నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని, ప్రజలకు అందుబాటులో ఉండడం లేదన్నారు. వర్షాలకు రోడ్లు తెగిపోయిన గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోతున్నాయని, హైలెవల్ వంతెనలు నిర్మించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అర్హులకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమిఇవ్వడం లేదన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ అధికారంలో రావడం ఖాయమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, కాముని వనిత, చొప్పదండి ప్రకాశ్, ఆకునూరి బాలరాజు, కల్యాణ చక్రవర్తి మండల అధ్యక్షుడు హమీద్, ఎంపీటీసీ పర్శరాములు, నాయకులు లచ్చయ్య, నర్సింలు, రాంచంద్రారెడ్డి, గంగిస్వామి, జంగం రాజు, రాజుగౌడ్ పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్య



చందుర్తి: మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందుర్తిలో శనివారం విషాదం నింపింది. చందుర్తికి చెందిన లక్కర్సు రాజేశం(53) తాగుడుకు బానిసయ్యాడు. మద్యం మత్తులో ఇంట్లో వారందరూ నిద్రిస్తుండగా శనివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చందుర్తి పోలీసులు తెలిపారు. మృతుడు రాజేశం భార్య రాజవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు చంద్రశేఖర్, శశికుమార్ ఉన్నారు.

కొట్టుకువచ్చిన మృతదేహాలు

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పట్టణం అంబబాయ్ గుడి సమీప వాగులో రెండు మృతదేహాలు కనిపించాయి. పోలీసుల వివరాలు.. సిరిసిల్ల మానేరువాగు చెక్‌డ్యాం పక్కన మృతదేహాలను ఖననం చేసే స్థలం ఉంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వరద పోటెత్తడంతో చెక్‌డ్యాం పక్క నుంచి నీరు వెళ్లింది. నీటి ప్రవాహం తగ్గడంతో దాదాపు నెలన్నర క్రితం ఖననం చేసిన మృతదేహాలు ఇసుకలో కనిపించాయి. పోలీసు అధికారులు సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి అధికారులకు సమాచారం ఇచ్చినా, అధికారిక సందేహాల నివృత్తితో మున్సిపల్ సహకారంతో మృతదేహాలను మళ్లీ ఖననం చేసినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

తంగళ్లపల్లిలో గ్రామసభలు

తంగళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ గ్రామసభలు నిర్వహించారు. ఆయా గ్రామాలపరిధిలో ఉపాధిహామీలో చేపట్టిన పనులు వెచ్చించిన నిధులను చదివి గ్రామస్తులకు వివరించారు. అనంతరం గ్రామస్తుల సమక్షంలో తీర్మానాలు చేశారు.

ఉత్తమ సేవలకు డాక్టరేట్



అవార్డు తీసుకుంటున్న మధు మహేశ్

వేములవాడ: కరోనా కష్టకాలంలో పేదలకు అండగా నిలవడంతోపాటు గత 818 రోజులుగా వేములవాడలో నిత్యం అన్నదానం నిర్వహిస్తున్న మై వేములవాడ ట్రస్టు ప్రతినిధి మధు మహేశ్ సేవలను గుర్తించిన బెంగళూరుకు చెందిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బెంగళూర్‌లో శనివారం మధు మహేశ్ డాక్టరేట్‌ను అందుకున్నారు. మహేశ్ మాట్లాడుతూ దోస్తులంతా కలిసి ఏర్పాటుచేసుకున్న వాట్సాప్ గ్రూప్ కాస్త మై వేములవాడ ట్రస్టుగా అవతరించి ఉచితసేవలందిస్తున్నట్లు తెలిపారు. సేవలను గుర్తించడం ఆనందంగా ఉందన్నారు.

కళాకారుదు 'అశోక్'కు గౌరవ డాక్టరేట్..

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం సిరిసిల్లకు చెందిన ప్రముఖ నాట్యకళాకారుడు నక్క అశోక్ శనివారం గౌరవ డాక్టరేట్ పొందారు. 15ఏళ్లుగా అశోక్ నాట్యరంగంలో రాణిస్తున్నారు. శ్రీలంబోదర కల్చరల్ అకాడమీని స్థాపించి ఎంతోమంది కళాకారులను తీర్చిదిద్దుతున్న ఆయన సేవలను ఆసియన్ ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ తమిళనాడులో గౌరవ డాక్టరేట్ అందించారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, డాక్టర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

తెగిన రోడ్డుకు మరమ్మతు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్–పోతిరెడ్డిపల్లి గ్రామాల మధ్య భారీ వర్షాలకు తెగిన రోడ్డును జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు తన సొంత ఖర్చులతో శనివారం తాత్కాలికంగా మరమ్మతు చేయించారు. రోడ్డుతెగిపోవడంతో రెండు గ్రామాల మధ్య వారం రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సర్పంచ్‌లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ తిరుపతిబాబు, వెంకయ్య, పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులపై నిర్లక్ష్యం వీడండి

సిరిసిల్లటౌన్: ఆర్టీసీ కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు కోరారు. సిరిసిల్లలోని ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్ క్యాంపు ఆఫీసును శనివారం ముట్టడించి మాట్లాడారు. ఆర్టీసీ ట్రేడ్ యూనియన్లపై నిషేధం ఎత్తివేయాలని, కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ప్రజా అవసరాల కోసం బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. క్యాంపు ఆఫీసులో వినతిపత్రం అందించారు. పంతం రవి, మంచికట్ల రమేశ్, మంత్రి చంద్రన్న, సోమ నాగరాజు పాల్గొన్నారు.

తిమ్మాసికుంట గండిని మరమ్మతు చేస్తాం

ఎల్లారెడ్డిపేట: తిమ్మాసికుంట గండిని శాశ్వతంగా మరమ్మతు చేస్తామని నీటిపారుదలశాఖ అధికారి భావుసింగ్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మేజర్ పంచాయతీ పరిధిలోని కిషన్‌దాస్‌పేట శివారులో గండి పడిన కుంటను శనివారం పరిశీలించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కుంట పరిస్థితిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో అధికారులు పరిశీలించారు.భావుసింగ్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇబ్బందులు రాకుండా బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. పంచాయతీ రాజ్ నిధులతో వంతెన నిర్మిస్తామన్నారు. ఒగ్గు బాల్‌రాజ్ యాదవ్, రాజిరెడ్డి, రాజుయాదవ్, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, కొమురయ్య, బాల్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు



కోనరావుపేట/వేములవాడఅర్బన్/తంగళ్లపల్లి/ముస్తాబాద్/గంభీరావుపేట/ఇల్లంతకుంట/వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట/బోయినపల్లి: సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోశనివారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు గ్రామాల్లో ఉదయాన్నే డప్పుచప్పుళ్లతో పీరీలను ఇంటింటికి తిప్పుతూ ఊరేగింపు నిర్వహించారు. మహిళలు ముడుపులు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. హిందూ, ముస్లింలు కలిసిమెలసి వేడుకల్లో పాల్గొన్నారు. తొమ్మిది రోజులు ప్రత్యేక ప్రార్థనలు అందుకున్న పీరీలను గ్రామశివారుల్లోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. మొహర్రం త్యాగాలకు ప్రతీకగా నిలుస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. బోయినపల్లి మండలకేంద్రంలో తడగొండ, మల్కాపూర్ గ్రామానికి చెందిన పలువురు యువకులు పెద్దపులి వేషధారణతో సందడి చేశారు.

ఇస్సాదారుల సమస్యలు పరిష్కరించండి



కొలనూర్‌లో రాస్తారోకో చేస్తున్న సుంకరి ఇస్సాదారులు

కోనరావుపేట: తమ సమస్యలు పరిష్కరించాలని సుంకరి ఇస్సాదారులు రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని కొలనూర్‌లో సిరిసిల్ల–కోనరావుపేట ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇస్సాదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క పర్శరాములు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వీఆర్ఏలను రెగ్యులర్ చేస్తామని, వివిధశాఖల్లో భర్తీచేస్తామని ప్రకటించారన్నారు. వీఆర్ఏలను రెగ్యులర్ చేస్తే సుమారు 4000 కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. పాతపద్ధతిలో ఇస్సాదారులను కొనసాగించాలని, సమాన హక్కులు కల్పించాలని, నేరుగా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.వీరవేణి తిరుపతి, సత్యం, స్వామి, అన్ని గ్రామాల ఇస్సాదారులు పాల్గొన్నారు.

వంటావార్పుతో జీపీ కార్మికుల నిరసన



రహదారిపై కార్మికుల వంటావార్పు

ఎల్లారెడ్డిపేట: ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ.. 24 రోజులుగా నిరవధిక సమ్మెచేస్తున్న పంచాయతీ కార్మికులు శనివారం సిరిసిల్ల–కామారెడ్డి ప్రధానరహదారిపై వంటావార్పుతో నిరసన వ్యక్తం చేశారు. రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేపట్టారు. కార్మికులకు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే.గౌస్, సద్ది లక్ష్మారెడ్డి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు రేసు రాజయ్య మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామన్నారు. రోడ్డుపై వంటలు వండి భోజనాలు చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు జక్కుల మహేందర్, కార్మికులు నర్సయ్య, భారతి, లక్ష్మి, రాములు, లింగవ్వ, శంకర్, సాయి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీచేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి 10వ వార్డు చిన్నబోనాలలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు శనివారం అందించారు. చెలిమల శ్రీనివాస్ రూ.28,500లు, మాదుదుల వెంకటి రూ. 25,500లు, మాడుదుల మల్లయ్యకు రూ.16వేలు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు దడిగెల శ్రవణ్‌రావు, 10వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు సుంకరి సాయి, యూత్ అధ్యక్షుడు నాగుల ఎల్లం, చల్ల అంజయ్య, శంకర్, మల్లేశం, తదితరులు ఉన్నారు.

వీర్నపల్లి: మండలంకేంద్రంలో గ్రామాధ్యక్షుడు కమటం నాగరాజు ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీచేశారు. లోకుర్తి అఖిలకు రూ.19వేలు, అల్లెపు పద్మకు రూ.20వేలు, తొవుటు మానసకు రూ.22,500, మునిగే గంగారాం రూ.25వేలు, చొప్పరి నర్సంగంకు రూ.32,500లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాటి దినాకర్, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, రాష్ట్ర సేవాలాల్ సంఘం ప్రధానకార్యదర్శి సురేశ్‌నాయక్, ఉపసర్పంచ్ బోయిని రవి, నీలం రాజేశ్‌బాబు, భగవంతం, శ్రీరామ్, భూక్య తులసీరామ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతులకు నష్టం



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కవ్వంపల్లి

ఇల్లంతకుంట: ప్రభుత్వ నిర్లక్ష్యంతో అనంతగి ప్రాజెక్టు ఓవర్ ఫ్లో గేట్ల పరివాహక ప్రాంత రైతులకు తీవ్రనష్టం వాటిల్లిందని కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని అనంతగిరి అన్నపూర్ణ రిజర్వాయర్‌ను సందర్శించారు. ఓవర్‌ఫ్లో గేట్లు ఎత్తడంతో పంటలు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. వర్షాలు కురవకముందే అనంతగిరి రిజర్వాయర్‌లో నీళ్లు నింపడంతో నాలుగురోజులు కురిసిన భారీ వర్షాలకు నీటిని బయటకు వదలడంతో ప్రవాహం ఎక్కువై పంటలు దెబ్బతిన్నాయన్నారు. రెండు కిలోమీటర్ల మేర పంటలకు నష్టం జరిగిందని, నీటిపారుదలశాఖ అధికారులు స్పందించి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులను ఆదుకోవాలన్నారు. మరోసారి రైతులకు ఇలాంటి నష్టం జరగకుండా ఉండాలంటే శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఆయన వెంట అంతగిరి వినయ్‌కుమార్, పసుల వెంకటి, రాఘవరెడ్డి, పాశం రాజేందర్‌రెడ్డి, జమాల్, సంతోష్, రజినీకాంత్, బాబు, నరేష్, ఎల్లారెడ్డి, సంపత్ రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

పీహెచ్‌సీలో సాధారణ ప్రసవం



తల్లీబిడ్డతో వైద్యుల బృందం

తంగళ్లపల్లి: ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలను ఎల్లప్పుడూ కంటికి రెప్పలా కాపాడుతాయని నేరెళ్ల పీహెచ్‌సీ వైద్యులు మరోసారి రుజువు చేశారు. శనివారం మెడికల్ అధికారి జిందం రేఖ ఆధ్వర్యంలో గర్భిణి శ్యామ అశ్వినికి పురుడు పోయగా పండంటి ఆడబిడ్డ జన్మించింది. ఎటువంటి ఆపరేషన్ లేకుండా సాధారణ ప్రసవం చేశామని, తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని మెడికల్ అధికారి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈసందర్భంగా పీహెచ్‌సీ వైద్య బృందాన్ని ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ పూర్మాని మంజుల, ప్రజాప్రతినిధులు అభినందించారు.

అక్రమ కేసు ఎత్తివేయాలి



క్షీరాభిషేకం చేస్తున్న సంఘం సభ్యులు

సిరిసిల్లఅర్బన్: గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్‌పై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలని కోరుతూ విద్యానగర్ చౌరస్తాలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ, జిల్లాలో గౌడ జాతి అభివృద్ధికి కృషి చేస్తున్న వ్యక్తి గోవర్ధన్‌గౌడ్‌పై కొందరు కావాలనే అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పెట్టిన కేసు ఎత్తివేయాలని, లేకుంటే పోరాటం చేస్తామనిహెచ్చరించారు. సంఘం ఉపాధ్యక్షులు బోల్గం నాగరాజ్‌గౌడ్, బండి దేవదాస్‌గౌడ్, పులలక్ష్మీపతిగౌడ్, అమరేందర్‌గౌడ్, గజ్జెల రాజశేఖర్ గౌడ్, పోన్నం లక్ష్మణ్‌గౌడ్, నర్సయ్యగౌడ్, కొండ రమేష్‌గౌడ్, దత్తాద్రిగౌడ్, సంతోష్‌గౌడ్, ప్రశాంత్ గౌడ్, మల్లేశంగౌడ్, భరత్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కందుకూరి రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పూలే దంపతుల విగ్రహావిష్కరణ

ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్‌లో సామాజిక ఉద్యమ దంపతులు జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణను ఆదివారం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ లక్ష్మి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చిగురు వెంకన్న తెలిపారు.